క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సహస్ర లింగార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో సహస్ర లింగార్చన వైభవంగా నిర్వహించారు. నటరాజ స్వామి వారి ఆలయం సమీపంలోని కుంకుమార్చన వేదిక వద్ద అర్చకులు శనివారం సహస్ర శివలింగాలను తీర్చిదిద్ది, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. ఉభయదాతలు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి, ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న వారికి హెచ్‌సీఎల్ టీటెక్ సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇస్తుందని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఉపాధి అవకాశాలను కూడా అదే సంస్థ కల్పిస్తుందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టర్ సరితకు ఆర్ఎస్ఎస్‌డీఐ అవార్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మధుమేహంపై విస్తృత అవగాహన కలిగిస్తున్నందుకు గాను నగరానికి చెందిన డయాబెటాలజిస్ట్ డాక్టర్ కాకాని సరిత ఆర్ఎస్ఎస్‌డీఐ ఉమెన్ డయాబెటాలజిస్ట్ అవార్డు 2023 అందుకున్నారు. ముంబాయిలో జరిగిన 51వ జాతీయ ఆర్ఎస్ఎస్‌డీఐ సదస్సులో అంతర్జాతీయ డయాబెటీస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ అక్తర్ హుసేన్, ఆర్ఎస్ఎస్‌డీఐ ప్రెసిడెంట్ డాక్టర్ బ్రిజ్ మక్కర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శశాంక్ జోషిల చేతుల మీదుగా డాక్టర్ సరిత ఈ అవార్డును అందుకున్నారు. ఆమెకు పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.

సహజ అభ్యుదయ కవి సోమసుందర్

విజయవాడ కల్చరల్: సహజ అభ్యుదయ కవి అవంత్స సోమసుందర్ అని కవి, విమర్శకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. 56 వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం కవి, సాహితీ విమర్శకుడు అవంత్స సోమసుందర్ జీవన రేఖలు అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. సాహితీ ప్రముఖుడు పన్నాల సుబ్రహ్మణ్య భట్టు మాట్లాడుతూ సోమసుందర్ కవితా రీతిని తెలుసుకోవడానికి వజ్రాయుధం చాలన్నారు. హనుమంతరాయ గ్రంథాలయ నిర్వాహకులు బి.కృష్ణప్రియ, అరుణ, గ్రంథాలయ అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు, కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, గ్రంథాలయ పాలక మండలి సభ్యుడు నీలం దుర్గారావు, బెల్లపు బాబ్జీ పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమాలకు ప్రేరణ తెలుగు నాటకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అనేక సామాజిక ఉద్యమాలకు తెలుగు నాటకం ప్రేరణనిచ్చిందని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్‌లో 'తెలుగు నాటక సాహిత్యం' అంశంపై సదస్సును శనివారం సాయంత్రం నిర్వహించారు. సాహితీమూర్తులు తెలుగు నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్, డాక్టర్ వెన్నా వల్లభరావు తదితరులు తెలుగు నాటక సాహిత్యం విశిష్టతను వివరించారు. కార్యక్రమాన్ని సాహితీవేత్త డాక్టర్ జీవీ పూర్ణచంద్ నిర్వహించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రముఖులు మనోహర్‌నాయుడు, లక్ష్మయ్య, బెల్లపు బాబ్జీ, పల్లవి వెంకటరమణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలపై నివేదికను సిద్ధం చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న సంవత్సరానికి సంబంధించి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సమగ్రాభివృద్ధికి సమగ్ర నివేదికకు అవసరమైన వివరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పంపించాలని జిల్లా డీఈవో సీవీ రేణుక ఆదేశించారు. కొత్తపేటలోని హిందూహైస్కూల్ ప్రాంగణంలో జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్, సీఆర్పీల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీవీ రేణుక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీసీ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో వనరులకు సంబంధించి పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామ కమిటీ చర్చించి తీర్మానం చేసుకొని త్వరితగతిన జిల్లాకు పంపవలసినదిగా కోరారు. అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనలోనే నగరానికి మహర్దశ

● ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే నగరానికి మహర్దశ పట్టిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని మువ్వలవారి వీధి, గంజి యలమందయ్య వీధిలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న పలు రోడ్లకు ఆయన శనివారం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. విజయవాడ నగరాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమైందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. నగరంలో రహదారులను, కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్స్‌ను అభివృద్ధి చేస్తున్న సీఎం జగనన్న ప్రభుత్వంపై బురద చల్లితే సహించేది లేదని హెచ్చరించారు. అభివృద్ధిపై దమ్ముంటే టీడీపీ, జనసేన నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో జలీల్‌ఖాన్, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, కేశినేని నానీ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



44వ డివిజన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

భువనేశ్వరి ఓదార్పు యాత్ర ఏమైంది..

అమరావతి పేరుతో విజయవాడ నగరాన్ని మోసం చేసిన దుష్టత్రయం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ అని వెలంపల్లి పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జలీల్‌ఖాన్ ఇంటి రోడ్డుతో పాటు జనసేన నాయకుడి ఇంటి రోడ్డును కూడా మేమే వేశామన్నారు. చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు భువనేశ్వరి ప్రారంభించిన ఓదార్పు యాత్ర ఏమైందని ఎద్దేవా చేశారు. తల్లీ, కొడుకుల రాజకీయ డ్రామాలు కట్టిపెట్టాలని హితవు పలికారు. విద్యాధరపురంలో స్టేడియం నిర్మాణంపై రాజకీయాలు చేయడం సబబు కాదని, క్రీడాకారులకు జనసేన వ్యతిరేకమా అని ప్రశ్నించారు.

దిక్కుమాలిన రాజకీయాలు మానుకోవాలి

చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లు దిక్కుమాలిన రాజకీయలు మానుకోవాలని ఎమ్మెల్యే వెలంపల్లి హితవు పలికారు. తెలంగాణలో 8 మందిని పోటీకి నిలబెట్టిన పవన్ కల్యాణ్ తన సొంత పార్టీని నట్టేట ముంచారన్నారు. విజయవాడ నగరంలో అత్యధిక రోడ్లు నిర్మించింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, నాయకులు మైలవరపు దుర్గారావు, మైలవరపు కృష్ణ, వీరంకి సత్యనారాయణ, సీహెచ్ రాఘవరావు, ఇనపకుర్తి రాము, నారాయణ, జి.రామదాసు, కె.రాధ, ఎస్.సీ తారామయ్య, వి.మధు, రవికుమార్, నాగరాజు, దుర్గారెడ్డి, అద్దేపల్లి సత్యనారాయణ, లేళపూడి లాజర్, ఐతా కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

చిత్ర కళ విశిష్టతను చాటేందుకే ఆర్ట్ ప్యారడైజ్



ఆర్ట్ ప్యారడైజ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిత్ర కళ విశిష్టతను చాటేందుకే ఆర్ట్ ప్యారడైజ్ నిర్వహిస్తున్నామని కార్యక్రమ నిర్వాహకుడు స్ఫూర్తి శ్రీనివాస్ తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్ట్ ప్యారడైజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ నడిపల్లి రవికుమార్, రజనిచౌదరి దంపతుల ప్రోత్సాహంతో స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్, ఆర్ట్ మేట్, ది స్కూల్ ఆఫ్ ఆర్టిస్ట్స్, చిత్రం ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆర్ట్ ప్యారడైజ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఉదయం పది గంటలకు 40 మంది విద్యార్థులతో ఏర్పాటు చేసిన చిత్ర కళ ప్రదర్శనను ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి ఎం.వి.సాయిబాబు ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు ఒకటో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు చిత్రకళా ప్రపూర్ణ నడిపల్లి సంజీవరావు స్మారక చిత్రలేఖనం పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. సాయంత్రం బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కో కన్వీనర్ గిరిధర్ అరసవల్లి, మహిళా విభాగం కన్వీనర్ సంధ్యారాణి, ఈవెంట్ కన్వీనర్ ఎస్.పి.మల్లిక్, కళాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధిపై సమగ్ర చర్చ జరగాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమ అంశాలపై మరింత సమగ్ర చర్చ జరగాల్సిన అవసరముందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎకనామిక్స్, కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'భారతదేశంలో గిరిజనుల జీవితం అభివృద్ధి విస్తృతి' అంశంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు సభకు కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య డి.సూర్యచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సులో పత్ర సమర్పణ చేసిన అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందజేశారు. మరో అతిథిగా హాజరైన అన్నామలై విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ ఆచార్యుడు ఆచార్య ఆర్ రంగరాజన్ మాట్లాడుతూ.. రెండు రోజుల సదస్సులో మంచి అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు.

శ్రీశ్రీ కవితా రీతులను అధ్యయనం చేయాలి

విజయవాడకల్చరల్: శ్రీశ్రీ కవితా రీతులను యువకవులు అధ్యయనం చేయాలని, ఆయన కవిత్వంలో సమాజ చిత్రీకరణ కనిపిస్తుందని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో కొమ్మవరపు విల్సన్‌రావు రచించిన నాగలి కూడా ఆయుధమే కవితా సంపుటిని విజయబాబు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గుండె కింద తడిని స్పృశించేదే అసలైన కవిత్వమని, సమాజాన్ని కదిలించి చైతన్య పరిచే శక్తి కవిత్వానికి ఉందన్నారు. విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ కవిత్వం కోసం కుటుంబాన్ని వదిలేసిన వారు ఎందరో ఉన్నారన్నారు. మల్లెతీగ సాహిత్యవేదిక నిర్వాహకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ కవులను, కళాకారులను ప్రోత్సహించడానికి మల్లెతీగ సాహిత్యవేదిక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, ఏపీ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఘంటా విజయకుమార్, కవి బంగారాజు, సాగర్ శ్రీరామ కవచం కవితా సంపుటిపై మాట్లాడారు. యువకవి అనిల్ డ్యానీ పుస్తక సమీక్ష చేశారు. రచయిత విల్సన్‌రావు తనకు ప్రేరణ కలిగించిన అంశాలను వివరించారు.



నాగలి కూడా ఆయుధమే కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న విజయబాబు తదితరులు

21న నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 21వ తేదీ సాయంత్రం నుంచి 22వ తేదీ ఉదయం వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. 49వ డివిజన్‌లోని 11ఎంజీడీ ప్లాంట్‌లోని 300 ఎంఎం డయా పంపింగ్ మెయిన్‌లైన్ కేటీ రోడ్డు, జోడు బొమ్మల సెంటర్ వద్ద మరమ్మతులకు గురైందని, దీనికి మరమ్మతులు చేస్తున్నందున నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. 49, 50వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నగరంలో శ్రీలీల సందడి



ఆటోనగర్(విజయవాడతూర్పు): నగరంలో సినీ నటి శ్రీలీల శనివారం సందడి చేసింది. విజయవాడ అశోక్‌నగర్ పవర్ మాల్‌లో సోల్ ఆఫ్ సౌత్ ఇండియన్ క్యూసైన్ రెస్టారెంట్‌ను ఆమె ప్రారంభించారు. ప్రస్తుతం ఆదికేశవ మూవీలో నటిస్తున్నట్లు శ్రీలీల చెప్పారు. అనంతరం ఐరన్ హిల్ గ్రూప్ కో ఫౌండర్ విధాత మాట్లాడుతూ నోరూరించే సౌత్ ఇండియా వంటకాలు రుచికరంగా ఉంటాయన్నారు. శ్రీలీలను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పోటీ పడ్డారు. కిశోర్‌బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మత్తు వ్యసనం నుంచి యువత బయటపడాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సరదాగా ప్రారంభమైన మత్తు పదార్థాల సేవనం క్రమేపి వ్యసనంగా మారుతుందని, దాని నుంచి యువత బయటపడాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక తెలిపారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా విద్యాధరపురంలోని ప్రభుత్వ జూనియర్(ఉర్దూ) కళాశాల విద్యార్థులకు శనివారం 'మాదక ద్రవ్యాల నిర్మూలనలో బాలలు, యువత పాత్ర' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్, అధ్యాపకులు కృష్ణప్రసాద్, దిల్షద్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాలల సంరక్షణ అందరి బాధ్యత అని, వారు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలని దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వాసవి అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్, పోలీస్ శాఖ, జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ, కృపా ఫౌండేషన్, యాక్షన్ ఎయిడ్ సంస్థల సహకారంతో నిర్వహించిన అవగాహన, చైతన్య సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జువెనైల్ హోమ్ సూపరింటెండెంట్ పి.రామమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బాలల హక్కుల వారోత్సవాలను అందరి సహకారంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. బాలలపై లైంగిక వేధింపులు, నివారణ అనే అంశంపై ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్ అవగాహన కల్పించారు. కోటే ప్రకాష్ కుమార్, యాక్షన్ ఎయిడ్స్ జిల్లా ప్రతినిధి రవీంద్ర, భక్తి వేదాంత స్వామీజీ, హోమ్ ఇంటెక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్ పాల్గొన్నారు.

సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం



మెడికల్ కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నాయకులు

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో సామాన్య ప్రజలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 49వ డివిజన్, 166 సచివాలయ పరిధిలోని వెలంపల్లి ఫౌండేషన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి వైద్య శిబిరాన్ని ప్రారంభించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌లను పంపిణీ చేశారు. వైద్యులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు గౌడుపేరు సుధీర్, చేపూరి శ్రీనివాసరావు, బడుగు అప్పారావు, చంటి పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 52వ డివిజన్ పరిధిలోని సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని స్థానిక కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ విభాగ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ యువతతోనే సాధ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ యువతతోనే సాధ్యమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. యువ ఓటర్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో 'యువర్ ఓటు -యువర్ పవర్' పేరుతో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రానున్న కాలంలో దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే యువతే బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు లక్ష్మీనారాయణ సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ తీరు పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం క్షేత్రస్థాయి పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ పరితీరును పరిశీలించారు. 40వ డివిజన్ భవానిపురం నేషనల్ హైవే వెంబడి రోడ్డు మార్జిన్స్‌లో ఉన్న పిచ్చి మొక్కలను త్వరగా తొలగించాలని అధికారులకు సూచించారు. 43వ డివిజన్ ఊర్మిళా సుబ్బారావునగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ట్రంక్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని, మెయిన్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తిని ఆదేశించారు. సీతారెడ్డి కాలనీలో పర్యటించి, స్థానికంగా కొందరికీ యూజీడీ లేకపోవటం గమనించి అందరూ తప్పని సరిగా యూజీడీ కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. బిన్ ఫ్రీ సిటీలో భాగంగా నగరంలోని అన్ని డంపర్ బిన్నులను తొలగించామని, ప్రజలు తప్పనిసరిగా ఇంటింటికీ వచ్చే పారిశుద్ధ్య నిర్వహణ సిబ్బందికి తమ చెత్తను అందించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజు చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ ఖచ్చితంగా చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

20న కుల గణనపై ప్రాంతీయ సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని స్టెల్లా కళాశాల సమీపంలో గల మెట్రోపాలిటన్ హోటల్ నందు ఈ నెల 20వ తేదీ ఉదయం కుల గణన - 2023పై ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సదస్సును విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రాంతీయ సదస్సు ఏర్పాట్లపై కలెక్టర్ ఢిల్లీరావు శనివారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదస్సుకు ఎన్టీఆర్ జిల్లాతో పాటు కృష్ణా జిల్లా, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల ప్రతనిధులు తదితరులు హాజరవుతారన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే చేస్తారన్నారు. కులగణనపై అధికారులు, సచివాలయ సిబ్బంది విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రుక్మాంగదయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై శ్రీనటరాజ నృత్యాలయంక చెందిన రోజా, దీక్ష, గౌతమి, జాహ్నవి, మోక్ష, భవ్య, మనస్విని, అఖిల, భార్గవి, సుదీప్తిలు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సామాన్య ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నియోజకవర్గంలో వివిధ డివిజన్లకు చెందిన 11 మందికి మంజూరైన రూ.4.61 లక్షల రూపాయాల చెక్కులను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెలంపల్లి తన క్యాంపు కార్యాలయంలో మేయర్ భాగ్యలక్ష్మితో కలిసి అందించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగా తదితరులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలు మానుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దళిత హోం శాఖ మంత్రిపై టీడీపీ, జనసేన చేస్తున్న శవ రాజకీయాలను మానుకోవాలని మాదిగ జేఏసీ అధ్యక్షుడు కొండ్రు సుధాకర్ అన్నారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితపై టీడీపీ, జనసేన నేతలు చేస్తున్న శవ రాజకీయాలకు వ్యతిరేకంగా శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగాగల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన సుధాకర్ మాట్లాడుతూ కొవ్వూరులో మహేంద్ర అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడితే దానికి మంత్రి తానేటి వనిత తన బాధ్యులను చేస్తూ కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని తెలిపారు. ఆ ఘటనకు మంత్రి తానేటి వనితకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఎస్సీలపై టీడీపీ చేస్తున్న దుర్మార్గాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ ఫిలిప్స్ గ్రిటన్, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో జరిగిన నేషనల్ చిల్డ్రన్స్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి పోటీలకు వన్‌టౌన్‌లోని ఎంఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థిని ఉజ్మా షేక్ ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థ ప్రధానోపాధ్యాయిని పి.శ్యామల తెలిపారు. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం నేషనల్ చిల్డ్రన్స్ కాంగ్రెస్ పోటీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. పిల్లల్లో యోగా, ఆటల అనుసంధానంతో మానసిక, శారీరక వికాసాన్ని ఎలా పెంపొందించవచ్చో వివరించి వివిధ స్థాయిల్లో ఎంపికై రాష్ట్ర స్థాయికి చేరుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారిణి సీవీ రేణుక నుంచి బహుమతిని పొందినట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు మద్ది సుబ్బారావు, సీహెచ్ అమరసుధీర్‌లు అభినందించారు.

పి.వి.రమేష్‌కు ఎక్సలెన్స్ అవార్డు



రామవరప్పాడు: విద్యారంగాభివృద్ధికి విశేష కృషి చేసిన, ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్ ఎడ్వైజర్ పి.వి.రమేష్‌కు అరుదైన గౌరవం లభించింది. పలు రాష్ట్రాల్లో ఫార్మసీ, మెడికల్, డెంటల్, నర్సింగ్, డిగ్రీ కళాశాలలను ఈ పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా విద్యా, వసతులపై వ్యక్తిగత శిక్షణ ఇచ్చినందుకుగానూ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో టైమ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో విద్యారంగంలో రమేష్‌కు ఈ ఎక్సలెన్స్ అవార్డును బీజేపీ నేషనల్ సెక్రటరీ మంజిర్ సింగ్ షిరస చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సార్కే ఫౌండేషన్ సెక్రటరీ బోయపాటి శ్రీ కృష్ణ మాట్లాడుతూ మారుతున్న విద్యా ప్రపంచానికి అనుగుణంగా భవిష్యత్‌లో నూతన సాంకేతిక విద్యను విద్యార్థులకు చేరవేసే విధంగా ఎప్పటికప్పుడు పరిశోధించి పలు కళాశాలల్లో అధ్యాపకులకు, విద్యార్థులకు పి.వి.రమేష్ శిక్షణ అందించారన్నారు.

టీడీపీ, జనసేన నేతలకు మాట్లాడే అర్హత లేదు

వించిపేట(విజయవాడపశ్చిమ): గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ పేర్కొన్నారు. టీడీపీ, జనసేనా నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలను నైజాం గేటు సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తీవ్రంగా ఖండించారు. గత చంద్రబాబు హయాంలో బీసీ సంక్షేమ హాస్టళ్లను మూసివేసి, ఆ విద్యార్థులకు తీరని అన్యాయం చేసినప్పుడు టీడీపీ, జనసేన నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. తమ న్యాయమైన కోర్కెల కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును అభ్యర్థించిన నాయీబ్రాహ్మణ సోదరులను తోకలు కత్తిరిస్తానని బహిరంగంగా హెచ్చరించి యావత్ బీసీ సమాజాన్ని అవమానపర్చినప్పుడు ఈ బీసీ నాయకులకు కనిపించలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగార్జున యూనివర్సిటీ విద్యార్థిని రిషితేశ్వరి కేసులో చంద్రబాబు నిర్లక్ష్యం దుర్మార్గమని, మహిళా అధికారి వనజాక్షిని అప్పటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని కొట్టి, అవమానపర్చినప్పుడు ఎందుకు స్పందించలేదన్నారు. అప్పటి సీఎం చంద్రబాబు, ఆయనకు వంతపాడిన జనసేన నాయకులు నిజమైన బీసీ ద్రోహులని గౌస్ మొహిద్దీన్ విమర్శించారు. బీసీ దండోరా రాష్ట్ర నాయకుడు రత్నం, కె.ప్రేమ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు రుద్రపాటి జయప్రకాష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విజ్ఞాన జ్యోతులు వెలిగించాలి



విజయవాడకల్చరల్: సమాజంలో విజ్ఞాన జ్యోతులను వెలిగించాలని, అందుకు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన కవయిత్రి, కాలమిస్ట్ చిల్లర భవానీదేవికి జ్ఞానజ్యోతి పురస్కారం అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కవులు, రచయితలు జాతి సంపదగా అభివర్ణించారు. ప్రభుత్వం కవులు, కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. ఏపీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కవులు, కళాకారులను సేవలను గుర్తిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రచయితల సంఘం ఉపాధ్యక్షుడు ఏ.జయప్రకాష్, సంఘ కార్యదర్శి సుభాని, సాహితీ ప్రముఖులు బోడి ఆంజనేయరాజు, సీహెచ్ శర్మ, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.